

రహదారిపై ధాన్యం కొనుగోళ్లు

- స్థలం లేక రైతులు అవస్థలు 6

'రైతులపై కేటీఆర్ మొసలి కన్నీరు'

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6:28 సోమవారం

సహర్ 4:41 మంగళవారం



ఖజానా గలగల



పన్నులు వసూలు చేస్తున్న సిబ్బంది

- ఆస్తి పన్నుల వసూళ్లలో రాష్ట్ర స్థాయిలో జిల్లా ఫస్ట్
- గ్రామ పంచాయతీ పన్నుల కలెక్షన్ సక్సెస్
- జిల్లాలో వంద శాతం పన్నుల వసూలు
- అభినందించిన కలెక్టర్ అనురాగ్ జయంతి

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఆస్తి పన్నుల వసూల రికార్డుల్లో మరోసారి రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్ర స్థాయిలో 98.19 శాతంతో ప్రథమంగా నిలిచింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న నిధులకు తోడు వివిధ రకాల పన్నుల వసూలుతో జిల్లా పల్లెల్లో చైతన్యం వెల్లువిరిసింది. గ్రామ పంచాయతీ సిబ్బంది పన్నుల వసూలును వంద శాతం పూర్తి చేయడంతో గ్రామ పంచాయతీల ఖజానా గలగలలాడుతోంది. జిల్లాలో మార్చి 30లోపు నిర్దేశించిన లక్ష్యాన్ని 98.19 శాతంతో పూర్తి చేశారు. పన్నుల వసూళ్లలో గ్రామ పంచాయతీల్లో జిల్లా ఆదర్శంగా నిలిచింది.

● జిల్లాలో రూ.6.93 కోట్ల వసూలు

జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో వెయ్యి కన్నా తక్కువ జనాభాలో వంద గ్రామ పంచాయతీలు, 1000 నుంచి 5 వేల వరకు 148 గ్రామ పంచాయతీలు, 5 వేలకు పైగా ఉన్న గ్రామ పంచాయతీలు ఏడు ఉన్నాయి. 2023-24లో జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య పర్యవేక్షణలో గ్రామ పంచాయతీకి రావాల్సిన ఆస్తి పన్నులు 7.04 కోట్లు వసూలు లక్ష్యం కాగా రూ.6 కోట్ల 93 లక్షల 36 వేల 880 వసూలు చేశారు. వంద శాతం పూర్తి చేసినందుకు కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రత్యేకంగా అభినందించారు. పన్నుల వసూళ్లలో జిల్లాలో రూ.7,04,60,882 లక్ష్యం కాగా ఇందులో రూ.65,41,962 పాత బకాయిలు ఉన్నాయి. ఇందులో పాత బకాయిల్లో రూ.30,41,508 వసూలు చేశారు. ఈ సంవత్సరం తాజా పన్నులు రూ.6,39,18,860 ఉండగా రూ.6,29,46,597 వసూలు చేశారు. పాత బకాయిలతో కలిపి రూ.6,93,36,880 వసూలు చేసి రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలిచారు. బోయినపల్లి మండలంలో 23 గ్రామ పంచాయతీల్లో రూ.45,89,297, చందుర్తి 19 పంచాయతీల్లో రూ.44,82,763, ఇల్లంతకుంట 33 పంచాయతీల్లో రూ.40,36,400, గంభీరావుపేట 21 పంచాయతీల్లో రూ.64,67,827, కోనరావుపేట 28 పంచాయతీల్లో రూ.38,63,435, ముస్తాబాద్ 22 పంచాయతీల్లో రూ.1,25,02,750, రుద్రంగి పది పంచాయతీల్లో రూ.26,33,226, తంగళ్లపల్లి 30 పంచాయతీల్లో రూ.79,85,990, వీర్నపల్లి 17 పంచాయతీల్లో రూ.15,29,265 వేములవాడ అర్బన్ 11 పంచాయతీల్లో రూ.65,70,682, వేములవాడ రూరల్ 17 పంచాయతీల్లో రూ.23,48,191 ఎల్లారెడ్డిపేట 24 పంచాయతీల్లో రూ.1,23,27,064 వసూలు చేశారు. గ్రామ పంచాయతీ పన్నుల వసూలును వంద శాతం పూర్తి చేయడంతో మౌలిక వసతుల కల్పనకు దోహదపడనున్నాయి.

పన్నుల వసూళ్లలో రాష్ట్రంలోనే అగ్రగామి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



జిల్లాలో గ్రామ పంచాయతీల్లో ఆస్తి పన్నుల వసూళ్లలో రాజన్న సిరిసిల్ల జిల్లా అగ్రగామిగా నిలిచింది. ఇందుకు కృషి చేసిన పంచాయతీ శాఖ అధికారులు, సిబ్బంది, సహకరించిన ప్రజలకు ప్రత్యేక అభినందనలు. జిల్లాలో ఉన్న 255 గ్రామ పంచాయతీల పరిధిలో రూ.7.05 కోట్ల ఆస్తి పన్ను వసూళ్లలో రూ.6.93 కోట్లు వసూలు చేసి 98.19 శాతంతో నిలిచాం. రాష్ట్రంలోనే అత్యధిక శాతం ఆస్తి పన్నులు వసూలు చేసిన జిల్లాగా రాజన్న సిరిసిల్ల జిల్లా మొదటి స్థానంలో ఉంది. రూ.13 లక్షల బకాయి ఆస్తి పన్నులు ప్రణాళికా బద్ధంగా వసూలుకు కృషి చేయాలి. ఇదే స్ఫూర్తిని రాబోయే సంవత్సరాల్లో సైతం చూపాలి.

అందరి సహకారంతోనే వంద శాతం పన్నుల వసూలు

- వీరబుచ్చయ్య, జిల్లా పంచాయతీ అధికారి



జిల్లాలో అన్నీ గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూలు వంద శాతం పూర్తి చేశారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మార్గనిర్దేశనం, ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, సిబ్బంది భాగస్వామ్యంతో ముందు వరుసలో నిలిచాం పన్నుల వసూలులో ప్రజల చైతన్యం కూడా మరువలేనిది. పన్నుల వసూలు ద్వారా అభివృద్ధి పనులకు చేయూతగా నిలుస్తాయి.

రాజన్న క్షేత్రంలో ఘనంగా పూర్ణాహుతి

- ముగిసిన శివ కల్యాణోత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ, మార్చి 31: వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి క్షేత్రంలో ఆదివారం పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శివ కల్యాణోత్సవాల్లో చివరిరోజు ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం పరివార దేవతార్చనలు, అభిషేకాలు, పారాయణాలు గావించారు. స్వామివారి కల్యాణ మండపంలో ఔపాసనము, బలిహరణము, శేషహోమం, జయాదులు గావించారు. అనంతరం యాగశాలలో ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం దేవతోద్వాసనము, నాకబలి, పుష్పయాగం, క్షేత్రపాలక బలి నిర్వహించారు. స్వామివారి త్రిశూలయాత్ర నిర్వహించి ధర్మగుండంలో అవబృథ స్నానం గావించారు. రాత్రి ఏకాదశావరణములు ఏకాంత సేవతో ఐదు రోజుల శివకల్యాణ ఉత్సవాలు ముగిసాయి.

● వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం ఆదివారం భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తమ ఇష్ట దైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని తరించారు. అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయం సైతం భక్తులతో భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులు బోనం మొక్కు చెల్లించుకున్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

లక్ష్యం రూ 5.6 కోట్లు.. వసూలు రూ.5.55 కోట్లు

- మున్సిపల్ కమిషనర్ లావణ్య అభినందనలు



బిల్ కలెక్టర్‌లను సన్మానిస్తున్న కౌన్సిలర్లు

సిరిసిల్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్నుల వసూళ్లలో సిరిసిల్ల మున్సిపల్ రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో సిరిసిల్ల మున్సిపల్ అస్థి పన్నుల వసూలు లక్ష్యం రూ.5.60 కోట్లు కాగా రూ.5.55 కోట్లు వసూలు చేశారు. సిరిసిల్ల పరిధిలో 22,989 గృహాలు ఉండగా ఇందులో కమర్షియల్ రెసిడెన్షియల్ 2773, కమర్షియల్ 2655, గృహాలు 17,561 ఉన్నాయి. మొత్తం 22,989 గృహాలకు సంబంధించి రూ.5.60 కోట్లు ఆస్తి పన్ను వసూలు కావాల్సిన లక్ష్యంగా ఉంది. ఇందులో రూ.7.34 లక్షలు పాత బకాయిలు ఉన్నాయి. పాత బకాయిలుపై 2.11 లక్షల జరిమానాలు విధించారు. మార్చి 31 వరకు 22,989 ఇళ్ల నుంచి రూ 5.55 కోట్లు వసూలు చేశారు. ఇందులో పాత బకాయిలు 4.72 లక్షలు, పెనాల్టీకి సంబంధించి రూ 31 వేలు వసూలు చేశారు. ఆదివారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో కౌన్సిలర్లు బిల్ కలెక్టర్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ లావణ్య సిరిసిల్లలో వందశాతం పన్నుల వసూలు పూర్తి చేసినట్లు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, ప్రజలు సహకరించడంతో పన్నుల వసూళ్లలో రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలిచామని, ఇందుకు కృతజ్ఞత తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. పన్నుల వసూళ్లకు కృషి చేసిన మున్సిపల్ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

గంభీరావుపేట, మార్చి 31: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని సెస్ ఏఈ రుషిక ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మానేరు వాగు వెంట విద్యుత్ అక్రమ కనెక్షన్లను గుర్తించామని తెలిపారు. అక్రమంగా విద్యుత్ వాడకంతో ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతోపాటు విద్యుత్ వినియోగదారులకు లోవోల్టేజీ సమస్య ఏర్పడుతుందని పేర్కొన్నారు. డబ్బులు చెల్లించి నూతన కనెక్షన్ మంజూరు చేసుకోవాలని తెలిపారు.

ఎద్దుగుట్ట మల్లన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం



సిరిసిల్ల పెద్దూర్ ఎద్దుగుట్ట మల్లన్నకు పుట్టమన్నుతో బోనాలు

సిరిసిల్ల రూరల్, మార్చి 31 : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్, బోనాల గ్రామాల శివారులో ఉన్న ఎద్దుగుట్ట మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పెద్దూర్, బోనాల గ్రామాల్లోని యాదవ సంఘాల ఆధ్వర్యంలో ఆది వారం రాత్రి పుట్టమన్నుతోపాటు బోనాలతో మహిళలు ఆలయానికి తరలివెళ్లారు. మల్లన్నపట్నం వేశారు. ఒగ్గు పూజారులు కన్నుల పండువగా నిర్వహించారు. సోమవారం ఉదయం ఆలయంలో నాగవెల్లి పట్నం వేసి మల్లికార్జున స్వామి కల్యాణాన్ని నిర్వహించడంతోపాటు అన్నదానం చేసేందుకు యాదవ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు గంగుల మల్లయ్యయాదవ్, ఉపాధ్యక్షుడు గంగుల భాస్కర్‌యాదవ్, ప్రధానకార్యదర్శి గోడుగు చిన్న ఎల్లయ్యయాదవ్, కోశాధికారి లెంకల అజయ్‌యాదవ్, కార్యదర్శి సలేంద్రి రవియాదవ్, పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్ జీల కిషన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

కోనరావుపేట, మార్చి 31 : బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం రామన్నపేటలో ఆదివారం ఆత్మీయ సభలో మాట్లాడారు. పలువురు బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి పార్టీలో చేరుతున్నారన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ వచ్చింది కరువు వచ్చిందని అంటున్నారని, వేసవిలో ఎలా వర్షాలు పడతాయి ఎలా మాట్లాడుతున్నారు అనేది ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. తనను గెలిపించిన ప్రతీ ఒక్కరికి రుణపడి ఉంటానన్నారు. జిల్లా నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, కచ్చకాయల ఎల్లయ్య, చేపూరి గంగాధర్, తాళ్లపల్లి ప్రభాకర్, ఫిరోజ్ పాషా, బాల్ రెడ్డి, మండల నాయకులు పల్లె రవీందర్, నాగిరెడ్డి, దేవరాజు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ముస్తాబాద్‌లో ఒక్క చోట చేరిన పూర్వ విద్యార్థులు

ముస్తాబాద్, మార్చి 31: పదోతరగతి వరకు కలిసి చదువుకున్న వారంతా దాదాపు 45 ఏళ్లకు కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1978-80 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 45 ఏళ్లకు ఒక్క చోట చేరారు. విద్యార్థి దశలో ఆడిపాడిన సంగతులను ఒకరినొకరు పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పర్శరాములు, సురేందర్‌రెడ్డి, గందె చంద్రం, అనమేని బాలయ్య, వంగ సంజీవ్, రమేశ్, కరెడ్ల ఎల్లారెడ్డి, కరడ్ల తిరుమల్‌రెడ్డి, గూడ బాల్‌రాజిరెడ్డి, గూడ రమేశ్‌రెడ్డి, ఎల్లాగౌడ్, రాంచంద్రారెడ్డి, యూసూఫ్, శైలజ పాల్గొన్నారు.

సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 31: సీ-విజిల్ యాప్ ద్వారా ప్రజలు ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి ఆదివారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఓటర్లను మభ్యమపెట్టేందుకు నగదు, మద్యం, ఇతర వస్తువులను పంపిణీ వంటి లైవ్ ఫొటోలు, లైవ్ వీడియోలు సీ- విజిల్ యాప్ ద్వారా పంపించాలన్నారు. సీ-విజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులపై వంద నిమిషాల్లో సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. సభలు, సమావేశాల్లో విద్వేషాపూరిత వ్యాఖ్యలు, అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహణ ఇతర ఎన్నికల ఉల్లంఘనలపై ఫొటోలు, వీడియోలను పంపించాలని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై 1950 ట్రోల్ ఫ్రీ నంబరు ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. 24 గంటలపాటు కలెక్టరేట్‌లో సీ-విజిల్ యాప్ ఫిర్యాదులపై పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచనున్నట్లు తెలిపారు.

సొంతింటి కల.. నెరవేరిన వేళ

- 'డబుల్' ఆనందంలో లబ్ధిదారులు



పెద్దలింగాపూర్ గ్రామంలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్లు

ఇల్లంతకుంట, మార్చి 31: ఎన్నో ఏళ్లుగా పేదలను ఊరిస్తున్న సొంతింటి కల నెరవేరింది. డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించాలని నిర్ణయించిన గత ప్రభుత్వం మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి 2016లో 20 ఇళ్లు మంజూరు చేసింది. పనులు కొంత ఆలస్యంగా ప్రారంభమవడం, గ్రామంలో ఇళ్లులేని నిరుపేదలు ఎక్కువగా ఉండడంతో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి గన్నారం నర్సయ్య పెద్దలింగాపూర్ గ్రామం నుంచి ఇల్లంతకుంటకు పాదయాత్ర చేపట్టి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అదనంగా ప్రభుత్వం 20 ఇళ్లు కేటాయించింది. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించగా భారీగా దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ అధికారులు అనేక సార్లు గ్రామసభలు నిర్వహించినా లబ్ధిదారుల ఎంపిక జరగలేదు. చివరకు 2021లో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. సరైన మౌలిక వసతులు లేకపోవడంతో అప్పటి సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్ సొంతంగా రూ.5 లక్షలు ఖర్చుపెట్టి వసతులు ఏర్పాటు చేశారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు అందుబాటులోకి రావడం, కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురయ్యారు. కొత్తవారిని ఎంపికచేస్తారనే వదంతులు వ్యాపించాయి. దీంతో ఆందోళన చెందిన లబ్ధిదారులు డబుల్‌బెడ్‌రూం ఇళ్లలోకి ప్రవేశించి ఉండడం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు లబ్ధిదారులను ఖాళీ చేయించడానికి ప్రయత్నించారు. పలు పార్టీలు లబ్ధిదారులకు అండగా నిలిచాయి. ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి లబ్ధిదారులను మండలపరిషత్ కార్యాలయానికి పిలిపించి వారి సమక్షంలోనే డ్రాలు తీసి నంబర్లు కేటాయించారు. గత నెలలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించారు. లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయడంతో సంతోషం వ్యక్తం చేశారు.



డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తొలగిన ఇబ్బందులు



- ఎలుకతుర్తి మనవ్వ, లబ్ధిదారు, పెద్దలింగాపూర్

ఏళ్ల తరబడి పడుతున్న ఇబ్బందులు తొలగిపోయాయి. సొంతింటి కల నెలవేరింది. కూలిపని చేసుకుంటూ జీవించే మాకు సొంతంగా ఇల్లుకట్టుకునే స్థోమత లేకపోవడంతో గుడిసెపై తాటిపత్రి కప్పుకొని ఉండేవాళ్లం. దీంతో డబుల్ బెడ్‌రూం ఇల్లు కేటాయించారు. కుటుంబసభ్యులతో కలిసి సంతోషంగా ఉంటున్నాం.

ఆలస్యమైనా ఆనందంగా ఉంది



- కీర్తి లక్ష్మి, లబ్ధిదారు, పెద్దలింగాపూర్

డబుల్ బెడ్ రూం ఇల్లు కేటాయింపులో కొంత ఆలస్యం జరిగినా ప్రస్తుతం ఇంట్లో ఆనందంగా ఉంటున్నాం. ఇల్లులేకపోవడంతో రేకుల ఇంట్లో ఉండేవాళ్లం. భార్యాభర్తలం కూలీపనులు చేసుకొని జీవిస్తాం. మా పరిస్థితిని అర్థం చేసుకొని డబుల్ బెడ్‌రూం ఇల్లు కేటాయించినందుకు ప్రభుత్వానికి స్థానిక నాయకులకు రుణపడి ఉంటాం.





ద్విచక్రవాహనం, ఆటో ఢీ: ఒకరి మృతి

తంగళ్లపల్లి, మార్చి 31: తంగళ్లపల్లి మండల కేంద్రంలో ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని ఆటో ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన హోటల్ నిర్వాహకుడు బోడ సురేష్ (40) ఆదివారం సాయంత్రం ద్విచక్రవాహనంపై తంగళ్లపల్లి నుంచి సిరిసిల్లకు వస్తుండగా వెనకనుంచి గుర్తు తెలియని ఆటో ఢీకొట్టింది. దీంతో సురేష్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. 108 వాతిహనంలో సురేష్‌ను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగా మృతిచెందాడు. మృతునికి భార్య ఉమ, కుమారుడు శ్రీహర్షిత్ ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గన్నేరువరం, మార్చి 31, మండలంలోని చొక్కారావుపల్లి బిక్కవాగు నుంచి అనుమతులు లేకుండా మండలంలోని జంగపల్లి గ్రామానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మండల కేంద్రానికి చెందిన కవ్వంపల్లి చంద్రయ్య ట్రాక్టర్‌ను ఆదివారం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

బోయినపల్లి, మార్చి 31: బోయినపల్లి పెట్రోల్ పంప్ సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ అక్కడిక్కడే మృతిచెందింది. వివరాల ప్రకారం వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామానికి చెందిన భారతి (50), సమీపబంధువు శ్రీకాంత్‌తో కలిసి ద్విచక్రవాహనంపై గంగాధర మండలం రంగారావుపల్లిలో జరిగిన శుభాకార్యానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. బంక్ సమీపాన అటోను ఢీకోట్టి కింద పడిపోయారు. ఈప్రమాదంలో భారతి అక్కడిక్కడే మృతిచెందగా శ్రీకాంత్‌కు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పృథ్వీధర్‌గౌడ్ తెలిపారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

ముస్తాబాద్, మార్చి 31: ముస్తాబాద్ మండల కేంద్రంలో ఓ మహిళా ఉరేసుకొని ఆత్మహత్య పాల్పడిన ఘటన ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొర్రె లలిత (50) అనే మహిళ అనే మహిళా మానసిక సమస్యలతో బాధపడుతూ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. వారికి ఇద్దరు కుమారులున్నారు. భర్త కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలు

చందుర్తి మార్చి 31 : చందుర్తి మండలం మల్యాల గ్రామ శివారులోని కోళ్ల ఫారం సమీపంలోని మూల మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడడంతో ఇద్దరి యువకులకు గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం రుద్రంగి మండలం మానాల చెందిన నాగరాజు అనే యువకుడితో పాటు మరో యువకుడు ద్విచక్ర వాహనంపై వేములవాడ నుంచి మానాలకు వెళుతుండగా మల్యాల గ్రామంలోని మూల మలుపు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడడంతో ఇద్దరికీ గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వేములవాడలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. విచారణ జరుపుతున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై కేసు

గన్నేరువరం, మార్చి 31: మండలంలోని మాదాపూర్‌లో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన బీజేపీ నాయకులపై కేసు నమోదు అయింది. గ్రామంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ఆదివారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన బీజేపీ నాయకులు బండి తిరుపతి, కాంతాల రాజిరెడ్డి, మాడుగుల రామకృష్ణా రెడ్డి, గంగాధర శ్రీకాంత్‌పై ఎఫ్ఎస్‌టి టీమ్ ఇంచార్జి రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపారు.

తల్లిపై కొడుకు హత్యాయత్నం

మంథని, మార్చి 31: మండలంలోని కాకర్లపల్లి గ్రామానికి చెందిన తీగల శాంత పై ఆమె చిన్న కొడుకు అయిన హరీష్ మద్యానికి బానిసై ఆదివారం కత్తితో దాడి చేసి గాయపరిచినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. ఉదయం సమయంలో తన తల్లిని డబ్బులు ఇవ్వమని తిట్టి, కొట్టడంతో అంతటితో ఆగకుండా తన తల్లిని చంపాలనే ఉద్దేశ్యంతో ఒక కత్తిని తీసుకొని ఆమె వీపు భాగంలో పొడిచినట్లు తెలిపారు. తన తల్లిపై హత్యాయత్నం చేసిన హరీష్ పై చర్య తీసుకోవాలని కూతురు తీగల మమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్లు తెలిపారు.









ఎన్టీపీసీ 'రెండో దశ'తో ఒప్పందానికి నో!

2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం.. కరెంటు కొనుగోలుకు సర్కారు విముఖత

- విద్యుత్తు వచ్చేది 5-8 ఏళ్ల తర్వాతే!
- అప్పటికి రూ.8-9 మధ్య యూనిట్ ధర
- ఒప్పందం చేసుకుంటే రాష్ట్రానికి గుదిబండే!



హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన రెండో విడత తెలంగాణ సూపర్ థర్మల్ విద్యుత్తు కేంద్రం నుంచి కరెంటు కొనుగోలు చేస్తే రాష్ట్రానికి పెనుభారంగా మారే ప్రమాదం ఉందని ప్రభుత్వం అంచనా వేసింది. 2400 మెగావాట్ల సామర్థ్యంతో తలపెట్టిన ఈ విద్యుత్కేంద్రం నిర్మాణానికి ఐదు నుంచి ఎనిమిదేళ్లు పడుతుందని.. అప్పటికి ఇక్కడి నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.8-9కి ఎగబాకుతుందని రాష్ట్ర ఇంధన శాఖ అంచనాకు వచ్చింది. బహిరంగ మార్కెట్లో ఇంతకంటే తక్కువ ధరకే విద్యుత్తు లభిస్తుండగా, భారీ ధరతో 25 ఏళ్ల పాటు కరెంటు కొనుగోలుకు దీర్ఘకాలిక ఒప్పందం చేసుకుంటే రాష్ట్ర ప్రజలపై రూ.వేల కోట్ల అనవసర భారం పడుతుందని తేల్చింది. ఈ నేపథ్యంలో ఎన్టీపీసీతో ఎలాంటి విద్యుత్తు కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. త్వరగా ఒప్పందం చేసుకోకపోతే ఇతర రాష్ట్రాలతో అగ్రిమెంట్ చేసుకుని విద్యుత్కేంద్రం నిర్మిస్తామని ఎన్టీపీసీ ఇటీవల అల్టిమేటం జారీ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై సమీక్షించి, కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని నిర్ణయించింది. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో విద్యుత్తు కొరతను తీర్చడానికి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 4000 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని పునర్విభజన చట్టం-2014లో కేంద్రం హామీ ఇవ్వగా, తొలి విడత కింద 1600 మెగావాట్ల విద్యుత్కేంద్రం నిర్మాణాన్ని ఇటీవల ఎన్టీపీసీ పూర్తి చేసింది. రెండో విడత కింద 2400 మెగావాట్ల ప్లాంట్లను నిర్మించాల్సి ఉంది. తొలి విడత విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.5.90 ఉండగా, ఒప్పందం కారణంగా కొనుగోలు చేయక తప్పని పరిస్థితి ఉంది.

గత సర్కారు తప్పిదమే..!

పదేళ్లలో గత ప్రభుత్వం చేసిన పాపాలు రాష్ట్రంలో విద్యుత్తు సంస్థలకు గుదిబండగా మారాయని కాంగ్రెస్ సర్కారు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. రెండో విడతలో 2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణానికి ఎన్టీపీసీతో ఒప్పందం చేసుకోకుండా 10 ఏళ్లపాటు జాప్యం చేయడమే దీనికి కారణమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అప్పట్లో ఒప్పందం చేసుకొని ఉంటే ఇప్పటికే నిర్మాణం పూర్తయి, తక్కువ ధరకు రాష్ట్రానికి కరెంటు వచ్చేదని చెబుతున్నాయి. ఇప్పుడు ఒప్పందం చేసుకుంటే భవిష్యత్తులో రాష్ట్రానికి గుదిబండగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కొత్త థర్మల్ ప్లాంట్లకు స్వస్తి..

దామరచర్లలో తెలంగాణ జెన్‌కో నిర్మిస్తున్న 4000 మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం నాలుగేళ్ల కిందే పూర్తి కావాల్సి ఉండగా, ఇంకా పనులు సాగుతున్నాయి. జాప్యంతో ప్రాజెక్టు నిర్మాణ వ్యయం పెరిగింది. కాలం చెల్లిన సబ్‌క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించిన భద్రాద్రి విద్యుత్తు కేంద్రం వ్యయం సైతం భారీగా పెరగడంతో దాని విద్యుత్తు ధరలూ పెరిగిపోయాయి. యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్ల నిర్మాణంలో తీవ్ర అవినీతి ఆరోపణలు రావడంతో కాంగ్రెస్ సర్కారు న్యాయ విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో మళ్లీ కొత్త థర్మల్ విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం జోలికి వెళ్లవద్దని ప్రభుత్వం ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లో రూ.2-4కు యూనిట్ చొప్పున లభిస్తున్న పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచుకోవాలని నిర్ణయించింది. సౌర, జల, పవన, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్తుపై దృష్టిపెట్టాలని నిర్ణయించింది.

బాసర ఆలయంలో విజిలెన్స్ తనిఖీలు

(మొదటిపేజీ తరువాయి)

సెంట్రల్ స్టోర్‌లో ఉన్న సరుకులను పరిశీలించారు. సరుకుల నాణ్యత, బ్రాండ్‌లు రికార్డుల్లో పేర్కొన్న ప్రకారం ఉన్నాయో లేదో సరి చూశారు. టెండరులో ఉన్న బ్రాండ్‌లు, క్వాలిటీ కాకుండా ఇతర సరుకులు ఉన్నట్లు, రికార్డుల్లో ఉన్న సరుకులకు, స్టోర్ రూమ్‌లో ఉన్న సరుకుల లెక్కలకు తేడాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆలయ కార్యాలయంలో దాదాపు 5 గంటల పాటు రికార్డులను పరిశీలించారు. సరుకుల కొనుగోళ్లకు సంబంధించిన ప్రతీ బిల్లును తనిఖీ చేశారు. జాబితాలో దాదాపు 70 శాతానికి పైగా సరుకుల ధరలు మార్కెట్ రేటు కంటే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయంలో ఆలయ అధికారులపై విజిలెన్స్ అధికారి అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎంఆర్‌పీ కూడా చూడకుండా టెండరును ఎలా నిర్ధారణ చేస్తారని అధికారులను ప్రశ్నించారు. విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా రావడంతో ఆలయ ఈవో హైదరాబాద్ నుంచి హుటాహుటిన బాసర వచ్చారు. కాగా, విజిలెన్స్ అధికారుల ఇచ్చే నివేదిక ఆధారంగా దేవాదాయ శాఖ చర్యలు తీసుకుంటుంది.

పంట నష్టం పరిహారమేదీ?

ఏడాదిగా ఎదురుచూస్తున్న రైతన్నలు.. గతేడాది మార్చి, ఏప్రిల్‌లో 1,51,545 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

- ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇస్తామన్న గత ప్రభుత్వం
- నేటికీ అందని రెండో విడత పంట నష్టపరిహారం
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఇవ్వాలని రైతుల వేడుకోలు



జగిత్యాల జిల్లా మోరపల్లిలో నేలవాలిన మొక్కజొన్న (ఫైల్)

జనగామ/జగిత్యాల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు అకాలవర్షానికి నేలపాలయ్యాయి. వడగళ్ల వానలు, ఈదురుగాలులు పంటలను అతలాకుతలం చేశాయి. రైతన్న వేదనను చూసిన ప్రభుత్వం.. వారికి పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చింది. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేల చొప్పున ఇస్తామని చెప్పింది. కానీ, ఏడాది కాలం గడిచిపోతున్నా.. ఇప్పటికీ రైతులకు పరిహారం అందలేదు. ఇంకా వారికి ఎదురుచూపు తప్పలేదు. గతేడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా అధిక విస్తీర్ణంలో వరి, మామిడి, మొక్కజొన్న తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోత దశకు వచ్చిన పంట కావడంతో వడగళ్ల దెబ్బకు గింజలన్నీ నేలరాలి రైతులకు కడగళ్లను మిగిల్చాయి. అధికారుల ద్వారా పంట నష్టం వివరాలను తెప్పించుకున్న నాటి ప్రభుత్వం.. నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లిస్తామని చెప్పినా.. కేవలం మార్చి నెలకు సంబంధించిన పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. అయితే మార్చి నెలలో జరిగిన నష్టం కన్నా ఏప్రిల్‌లో రెట్టింపు నష్టం సంభవించింది. కానీ, ఏప్రిల్‌లో జరిగిన నష్టానికి సంబంధించిన పరిహారాన్ని మాత్రం రైతులకు నేటికీ ఇవ్వలేదు. ఇందుకోసం రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు ఆనాడు ప్రకటించినా రైతుల ఖాతాల్లో మాత్రం జమ కాలేదు.

రెండు లక్షల ఎకరాల్లో పంట నష్టం..

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.28 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్న విషయాన్ని నాడు ఖమ్మం జిల్లాలో పంటల పరిశీలన సందర్భంగా అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇందులో మొక్కజొన్న 1,29,446 ఎకరాలు, వరి 72,709 ఎకరాలు, మామిడి 8,865 ఎకరాల్లో నష్టపోయిందని పేర్కొన్నారు. గతేడాది మార్చి 23న ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో కేసీఆర్ పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పంటనష్టం జరిగిన 26 జిల్లాల్లో వ్యవసాయాధికారులు సర్వే నిర్వహించి 1,51,545 ఎకరాల్లో నష్టం జరిగినట్లు తేల్చారు. దీనికి సంబంధించి ఎకరానికి రూ.10 వేల చొప్పున రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు గతేడాది జూన్‌లో కేసీఆర్ సర్కారు ప్రకటించింది. మొత్తం 1,30,988 మంది రైతులు పరిహారానికి అర్హులుగా పేర్కొంది. అయితే మార్చి నెల పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. కాగా, జగిత్యాల జిల్లాలో గతేడాది మార్చి, ఏప్రిల్‌తోపాటు జూలైనూ కలిపి 73,686 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో మార్చిలోనే 6,199 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా.. కేవలం 532 ఎకరాలకే పరిహారం చెల్లించారు. ఏప్రిల్‌లో 52 వేల ఎకరాల్లో, జూలైలో భారీ వర్షాలకు 15,487 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లగా.. ఇప్పటివరకు పరిహారం ఇవ్వలేదు. మొత్తంగా రెండో విడతకు సంబంధించి 20,160 మంది రైతులకు పరిహారం కింద రూ.36.69 కోట్లు చెల్లించాల్సి ఉంది.

ఆర్థిక శాఖలో పెండింగ్..

రెండో విడత పంట నష్టం పరిహారానికి సంబంధించిన నిధులు ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో 2 విడతలకు సంబంధించి రూ.151.54 కోట్లు విడుదల చేయగా వాటికి ఫైనాన్స్ క్లియరెన్స్ లభించలేదని అధికారులు చెబుతున్నారు. క్లియరెన్స్ వస్తే నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే అవకాశముంది. దీనిపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ఏడు ఎకరాల్లో పంట నష్టపోయాను



గతేడాది యాసంగిలో ఏడెకరాల్లో వరి పంట సాగు చేస్తే వడగళ్లు, ఈదురుగాలుల కారణంగా పంటంతా నాశనమైంది. చేతికొచ్చిన గింజలన్నీ చేలోనే రాలిపోయి ఏమీ చేతికిరాలేదు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. అధికారులు సర్వే చేసి పంట నష్ట పరిహారం అందిస్తామని చెప్పారు. కానీ, ఏడాది దాటుతున్నా ఒక్క పైసా పరిహారం రాలేదు. అధికారులను అడిగితే ప్రభుత్వం వద్దే పైసలు ఆగిపోయాయని చెబుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పరిహారాన్ని అందించాలి.

- గొడ్డేటి రాజు, గానుగుపహాడ్, జనగామ జిల్లా

రేపు తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనం రద్దు

తిరుమల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నెల తొమ్మిదో తేదీన ఉగాది ఆస్థానం సందర్భంగా మంగళవారం శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుండటంతో వీఐపీ బ్రేక్‌ను టీటీడీ రద్దు చేసింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పటికే ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను రద్దు చేసిన విషయం తెలిసిందే. ప్రొటోకాల్ పరిధిలో స్వయంగా వచ్చే వీఐపీలకు, ట్రస్టు దాతలకు మాత్రమే బ్రేక్ దర్శన టికెట్లను జారీ చేస్తున్నారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నేపథ్యంలో వీటిని కూడా రద్దు చేస్తున్నట్టు టీటీడీ తెలిపింది. కాగా, ఎన్నికల కోడ్ నేపథ్యంలో తిరుమల శ్రీవారి శ్రీవాణి ట్రస్టుకు గడిచిన 15 రోజుల్లో రూ.22.75 కోట్ల విరాళాలు అందాయి. ఎన్నికల కోడ్ కారణంగా మార్చి 16వ తేదీ నుంచి వీఐపీ బ్రేక్ సిఫారసు లేఖలను టీటీడీ రద్దు చేసింది. ఈ క్రమంలో శ్రీవాణి ట్రస్టుకు రూ.10వేల విరాళం అందించి రూ.500 బ్రేక్ దర్శన టికెట్లను కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగింది.

బెంగాల్‌లో తుఫాను బీభత్సం

- నలుగురి మృతి, 200 మందికి గాయాలు

కలకత్తా, మార్చి 31: పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయిగురి జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ తుఫాను కారణంగా పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. చెట్లు, హోర్డింగులు, కరెంటు స్తంభాలు నేల కూలాయి. పలు వాహనాలు తిరగబడ్డాయి. దాంతో నలుగురు మృతి చెందగా, 200 మందికిపైగా గాయపడ్డారు. మృతి చెందిన వారికి పశ్చిమ బెంగాల్ సీఎం మమత సానుభూతి తెలిపారు. వారి కుటుంబసభ్యులకు తగిన పరిహారం అందజేస్తామని ప్రకటించారు. గాయపడిన వారికి ప్రభుత్వమే చికిత్స అందిస్తుందని హామీ ఇచ్చారు. కల్లోలిత ప్రాంతాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టవలసిందిగా అధికారులను ఆదేశించారు. బెంగాల్ వరదల్లో మరణించిన వారికి ప్రధాని మోదీ సానుభూతి ప్రకటించారు.

జగన్ నిర్వాకంతో ఏపీ ఖజానా ఖాళీ

అప్పు తీసుకోకపోతే పూటైనా గడవదు... పింఛన్లు ఇవ్వడానికి డబ్బు లేక టీడీపీపై నెపం మోపే యత్నం: చంద్రబాబు

- మార్కాపురం, ఎమ్మిగనూరు, బాపట్లల్లో భారీ బహిరంగ సభలు



బాపట్ల/కర్నూలు/ఒంగోలు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ నిర్వాకంతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి ఖజానా ఖాళీ అయిందని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. అప్పు తీసుకోకపోతే పూటగడవని స్థితికి ప్రభుత్వం చేరుకుందన్నారు. ప్రస్తుతం పింఛన్లు ఇవ్వడానికి కూడా డబ్బు లేక.. ఆ నెపం టీడీపీపై మోపే ప్రయత్నం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ప్రజాగళం యాత్రలో భాగంగా ఆదివారం ఆయన ప్రకాశం జిల్లా మార్కాపురం, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, బాపట్ల జిల్లా కేంద్రంలో జరిగిన భారీ బహిరంగ సభల్లో ప్రసంగించారు. జగన్ ఈ ఐదేళ్లలో రూ.13 లక్షల కోట్ల అప్పు చేశాడని, వాటిని ఆయన రోత పత్రిక తీరుస్తుందా.. భారతీ సిమెంట్స్ తీరుస్తుందా అని నిలదీశారు. ఈ సీఎం నమ్మించి గొంతు కోసే రకమని దుయ్యబట్టారు. రాయలసీమ బిడ్డనని చెప్పుకొంటూ ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదన్నారు. ఈ ప్రాంతంలో 52 అసెంబ్లీ స్థానాలుంటే గత ఎన్నికల్లో 49 మంది వైసీపీ ఎమ్మెల్యేలను గెలిపించారని.. కానీ ఒక్క పనైనా చేశాడా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టయినా పూర్తి చేశాడా.. కర్నూలు ప్రాంతానికి కనీసం నీళ్లు ఇవ్వాలన్న ఆలోచనైనా చేశాడా.. పేదలు, యువత భవిష్యత్ గురించి ఆలోచించాడా అని నిలదీశారు. ఆయన రాయలసీమ ద్రోహి అని.. ఒక్క ఓటు వేసినా మన నెత్తిన మనమే చెత్తవేసుకున్నట్లు అవుతుందని హెచ్చరించారు. బటన్ నొక్కి ప్రజల సంక్షేమమని ప్రతిరోజూ చెబుతున్నాడని.. అలాగైతే మద్య నిషేధం, జాబ్ కేలెండర్, డీఎస్సీలపై ఎందుకు నొక్కలేదని ప్రశ్నించారు. తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచాడని.. ఆర్టీసీ, పెట్రోలు, డీజిల్, నిత్యావసరాల ధరలు పెరిగి జనం అల్లాడుతుంటే.. వాటిని తగ్గించే బటన్ ఎందుకు నొక్కలేదన్నారు. 'సంక్షేమం పేరుతో రూ.10 ఇచ్చి రూ.100 లాగేసుకుంటున్నాడు. బటన్ నొక్కి ఇచ్చింది ఎంత? ప్రజల నుంచి నొక్కింది ఎంత? అందులో మీరు బొక్కింది ఎంత' అని నిలదీశారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీ కన్నా తెలంగాణలో తలసరి ఆదాయం 35 శాతం అధికంగా ఉంటే 2014-19లో దానిని 27 శాతానికి తగ్గేలా చేశామని.. జగన్ వచ్చాక తేడా 45 శాతానికి పెరిగిందని.. బటన్ నొక్కి పేదల సంక్షేమం చేస్తే ఇంత వ్యత్యాసం ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. ఐదేళ్లుగా రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న శని మే 13తో విరగడైపోతుందని చెప్పారు.

ఫ్యాన్ చెత్తబుట్టలోకే..

ఈ ఎన్నికల్లో ఫ్యాన్ ముక్కలై చెత్తబుట్టలో పడేయడం ఖాయమని చంద్రబాబు అన్నారు. "ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని, విధ్వంసకర వైసీపీ పాలన అంతం కావాలన్న ఉద్దేశంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పొత్తుకు ఆద్యుడు పవన్. మూడు పార్టీలు కలవడం మాకోసం, మా రాజకీయాల కోసం కాదు. ప్రజలు గెలవాలి, ఏపీ బాగుండాలన్న ఉద్దేశం తోనే! ఈ విషయాన్ని ప్రజలంతా గుర్తించాలి. సంక్షేమంతో పాటు అభివృద్ధి చేయాలంటే కేంద్రం సహకారం అవసరం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తు పెట్టుకున్నాం. మేం కలిస్తే జగన్ ఎందుకు కంగారు పడుతున్నాడు? ముస్లింలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ఎన్డీయే అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు పోతాయని రెచ్చగొడుతున్నారు" అని మండిపడ్డారు.

కూటమి విజయం ఖాయం: పవన్

- వైసీపీ దోపిడీని అరికడితే అన్ని పథకాలకు నిధులు వస్తాయి
- పింఛన్లు అందేలా చూడండి.. 3 పార్టీల నేతలకు జనసేనాని పిలుపు



పిఠాపురం, మార్చి 31: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి రాబోయేది జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి ప్రభుత్వమేనని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు. భారీ మెజారిటీతో సీట్లు గెలవబోతున్నామని తెలిపారు. ప్రస్తుతం అమలు చేస్తున్న ఏ సంక్షేమ పథకం ఆగిపోదని.. ఈ విషయాన్ని స్పష్టంగా అందరికీ తెలియజేయాలని మూడు పార్టీల నేతలకు పిలుపిచ్చారు. ఆదివారం కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురం గోకులం గ్రాండ్‌లో ఆదివారం పిఠాపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసి సైబరాబాద్ వంటి ప్రత్యేక నగరాన్ని తయారు చేసిన అనుభవజ్ఞుడు, టీడీపీ అధినేత చంద్రబాబును జగన్ ప్రభుత్వం అకారణంగా, కక్షపూరితంగా జైలులో పెట్టినప్పుడు బాధేసిందని జనసేనాని పవన్ కల్యాణ్ అన్నారు. రాజమహేంద్రవరం వెళ్తున్నప్పుడు దారిపొడవునా టీడీపీ కార్యకర్తలు తమ నాయకుడి కోసం పడిన తపన తనను కదిలించిందని, అందుకే సెంట్రల్ జైలులో చంద్రబాబును కలిశాక తన వంతుగా ఏదైనా చేయాలని భావించి కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి వెళ్తాయని ప్రకటించానని ఆయన తెలిపారు. అప్పుడు తాను చెప్పినట్లుగానే బీజేపీ తమతో కలిసి వచ్చిందని చెప్పారు. ఆ పార్టీ కోసం ఎంపీ సీట్లు తగ్గించుకున్నానని తెలిపారు. తాను పొత్తు కోసం ఎంత తపించానో.. మూడు పార్టీల నాయకులు గెలుపు కోసం అంతే కష్టపడాలని సూచించారు. చిన్న చిన్న ఇబ్బందులు ఉన్నా వాటిని అధిగమించి పనిచేయాలని కోరారు. 'ఇప్పుడు ఇస్తున్న పథకాల కంటే అధికంగానే సంక్షేమ ఫలాలు పంచుతాం. మద్యం, గంజాయి, ఇసుక, ల్యాండ్ మాఫియా వంటి వాటిని అరికడితే అన్ని పథకాలకు కచ్చితంగా డబ్బులు సర్దుబాటవుతాయి. వైసీపీ దోపిడీ అరికడితే అప్పులు చేయకుండానే సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చు. ఎన్నికల కోడ్ వల్ల ప్రతినెలా ఒకటో తేదీన అందాల్సిన సామాజిక పింఛన్లు ఈ నెల ఆలస్యం కావచ్చు. వలంటీర్లు లేకుండా పింఛన్లు సక్రమంగా పంపిణీ చేసేందుకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నియామవళికి అనుగుణంగా అధికారులకు సహకరించాలి' అని సూచించారు.

ఉత్తరాదిపై మజ్లిస్ గురి!

- యూపీ, బిహార్‌లో ఖరారైన పొత్తులు
- వ్యూహాత్మకంగా హిందువులకూ టికెట్లు

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు హైదరాబాద్ పాతనగరంలో.. ఎంసీహెచ్(ప్రస్తుతం జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో పత్తర్‌గట్టీ డివిజన్ నుంచి విజయభేరీ మోగించిన మజ్లిస్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్(ఎంఐఎం) క్రమంగా జాతీయ పార్టీగా ఎదుగుతోంది. ఈ క్రమంలో బిహార్, యూపీల్లో ఓటుబ్యాంకును.. ఓట్ల శాతాన్ని పెంచుకుంటూ ముందుకు పోతోంది. ఈ క్రమంలో ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో తమకు సిటింగ్ స్థానం ఉన్న మహారాష్ట్రతో పాటు.. యూపీ, బిహార్‌పై ప్రత్యేకంగా దృష్టిసారించింది. "మేము బీజేపీకి వ్యతిరేకం. అలాగని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి మద్దతు కాదు. ఇండియా కూటమి కేవలం ఎన్నికల అవసరాలకే పరిమితం. మైనారిటీ, బడుగు వర్గాల అభ్యున్నతికి మేం పనిచేస్తాం" అని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. యూపీలో డాక్టర్ పల్లవి పటేల్ నాయకత్వంలోని అప్నాదళ్(కామెరవాడి)తో కలిసి పోటీ చేస్తామని ఆదివారం ఆయన ప్రకటించారు. ప్రగతిశీల మానవ్ సమాజ్ పార్టీ, రాష్ట్రీయ ఉదయ్ పార్టీతోనూ పొత్తు ఉంటుందని, బిహార్‌లోనూ ఎన్డీయే-ఇండియా కూటముల్లో లేని పార్టీలను కలుపుకొనిపోతున్నట్లు వివరించారు. ఉత్తరప్రదేశ్‌లో ఏడు, బిహార్‌లో 11 స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. బిహార్‌లో ఐదు చోట్ల హిందువులకు మజ్లిస్ టికెట్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్రలో గతంలో ఎంవీఏతో కలిసి పోటీ చేసిన మజ్లిస్.. ఈ సారి ఒంటరిగా వెళ్తోంది. తమ పార్టీ ఔరంగాబాద్ సిటింగ్ ఎంపీ ఇంతియాజ్ జలీల్ అదే స్థానంలో పోటీ చేయనుండగా.. మైనారిటీల బలం ఎక్కువగా ఉన్న మరో నాలుగు చోట్ల మజ్లిస్ బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో సమీకరణాలు అనుకూలంగా లేనందున పోటీ చేయడం లేదని మజ్లిస్ వర్గాలు తెలిపాయి.

రైతులపై కేటీఆర్ మొసలి కన్నీరు



సమావేశంలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

తంగళ్లపల్లి, మార్చి 31: చుట్టపు చూపుగా వచ్చి కేటీఆర్ రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నాడని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి విమర్శించారు. ఆదివారం తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఆయన మాట్లడుతూ వడగండ్ల వానతో నష్ట పోయిన పంటలను పరిశీలించి ముఖ్యమంత్రిని కలిసి విన్నవించుకుంటే ఎకారకు రూ.10 వేలు పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. గత ప్రభుత్వంలో పంట నష్ట పరిహారం ఇచ్చిన పాపన పోలేదని మండిపడ్డారు. పది రోజుల క్రితం వడగండ్ల వానతో పంట నష్ట పోతే రైతులను పరామర్శించని కేటీఆర్ కార్యకర్త కొడుకు వివాహానికి వెళ్తూ ఓ రైతును పరామర్శించి ప్రేమ ఉన్నట్లు నాటకం ఆడుతున్నారని అన్నారు. అధికారం కోల్పోయిన కేటీఆర్‌కు మతి భ్రమించి మాట్లాడుతున్నారన్నారు. నేతన్నలకు బతుకమ్మ చీరల బకాయిలు రూ.275 కోట్లు ఎగొట్టాడన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు కష్టాలు అనుభవించారన్నారు. రాష్ట్రానికి రూ.7 లక్షల కోట్ల అప్పు చేసి కేసీఆర్ తన ఆదాయన్ని పెంచుకున్నారన్నారు. ప్రజల కోసం పోరాడే నాయకులను, కార్యకర్తలను కాంగ్రెస్‌లోకి ఆహ్వాని స్తామన్నారు. దోపిడీ దారులకు స్థానం లేదన్నారు. ఎన్నికలు రాగానే బండి సంజయ్‌కి చేనేత బకాయిలు గుర్తుకొచ్చి సీఎంకు ఉత్తరం రాశారన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుర్మాణి మంజుల లింగారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, నాయకులు వైద్య శివప్రసాద్, కాముని వనిత, గోనె ఎల్లప్ప, చుక్క శేఖర్, హారిక రెడ్డి, లింగాల భూపతి, మునిగెల రాజు, మోర రాజు, మచ్చ శ్రీనివాస్, లింగం రాణి, భైరినేని రాము, గుగ్గిళ్ల భరత్, నేరెళ్ల నర్సింగం, గుగ్గిళ్ల శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, చెన్నవేణి ప్రశాంత్ పాల్గొన్నారు.

భారీగా చేరికలు

తంగళ్లపల్లి మండలంలోని పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. తంగళ్లపల్లి పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాపెల్లి ఆనందం, ఆదర్శ యూత్ క్లబ్ అధ్యక్షుడు బత్తిని మల్లేశంగౌడ్, మైనార్టీ నాయకులు హమీద్‌తోపాటు వడ్డెర సంఘం తదితరలు సుమారు 500 మంది పార్టీలో చేరారు.

రహదారిపై ధాన్యం కొనుగోళ్లు

- స్థలం లేక విలీన గ్రామాల రైతులు అవస్థలు
- రెండో బైపాస్‌రోడ్డులో వాహనదారుల ఇక్కట్లు
- స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి



సిరిసిల్ల రెండో బైపాస్ రోడ్డుపై ధాన్యం కుప్పలు

సిరిసిల్ల రూరల్, మార్చి 31: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని విలీన గ్రామాల రైతులు ధాన్యం ఆరబోత, కొనుగోలుకు ఇబ్బందులు పడుతున్నారు. విలీన గ్రామాలకు ఎక్కడా ధాన్యం కొనుగోలు, ఆరబెట్టుకోవాడానికి స్థలాలు లేకపోవడంతో ఐదేళ్లుగా రెండో బైపాస్ రోడ్డు దిక్కుగా మారింది. దీంతో మళ్లీ వాహనదారులకూ అవస్థలు తప్పడం లేదు. విలీన గ్రామాలైన రగుడు, ముష్టిపల్లి, చంద్రంపేట, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్ గ్రామాలను అనుకోని నూతనంగా నిర్మించిన రెండవ బైపాస్ రోడ్డుయే ధాన్యాన్ని అరబోతుతోపాటు కొనుగోలు కేంద్రాలకు అడ్డగా మారిపోయింది. ప్రతి సీజన్‌లో రైతుల పండించిన ధాన్యాన్ని అరబెట్టుకోవడంతోపాటు విక్రయించుకునేందుకు ఇబ్బందులు పడుతున్న జిల్లా అధికారులు పట్టించుకోకపోవడంతో రెండవ బైపాస్ రోడ్డులోని ఒక ప్రక్కన ధాన్యాన్ని అరబెట్టుకోని అక్కడనే కొనుగోలు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తున్నారు. అయితే బైపాస్ రోడ్డులో వేసిన సెంట్రల్ లైటింగ్‌లకు విద్యుత్ కనెక్షన్‌లు లేకపోవడంతో రాత్రిపూట వాహనాదారులు వాహనాలు ధాన్యం కుప్పలపైకి ఎక్కించి ప్రమాదాలకు గురైతున్నారని పెద్దూర్ శివారులో ఉన్న ప్రభుత్వ భూమిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసుకునేందుకు 10 ఎకరాల స్థలాన్ని కేటాయించి ఈ గ్రామాలకు చెందిన కౌన్సిలర్‌లతోపాటు పెద్దూర్ సింగిల్‌విండో పాలకవర్గం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతిని కలిసి పలుమార్లు వినతి పత్రాలను అందించిన ఎలాంటి స్పందన లేకుండా పోయింది. ఈ సీజన్‌లోనైనా జిల్లా కలెక్టర్ స్థలాన్ని కేటాయిస్తారని ఆశించిన రైతాంగానికి నిరాశనే ఎదురైంది. దీంతో గత్యంతరం లేక యాసంగి ధాన్యాన్ని అరబెట్టుకునేందుకు రైతులు రెండవ బైపాస్‌రోడ్డును ఈ సారీకూడి ఎంచకోని కోసిన ధాన్యాన్ని శనివారం నుంచి కుప్పలు పోశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి కొనుగోలు కేంద్రాలకు స్థలాలను కేటాయించి రోడ్డు కష్టాలనుంచి ఘట్టెక్కించాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం ఆరబోతకు ఇబ్బందులు

- గంగుల భాస్కర్‌యాదవ్, రైతు పెద్దూర్



విలీన గ్రామాల్లో ధాన్యం ఆరబోత, విక్రయానికి స్థలం లేదు. ఐదేళ్లుగా రెండో బైపాస్ రోడ్డుపైనే ఆరబెడుతున్నారు. అక్కడే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. స్థలాన్ని కేటాయించాలి.

పోలీస్ బెటాలియన్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు

సిరిసిల్ల రూరల్, మార్చి 31 : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్ధాపూర్ 17వ పోలీస్ బెటాలియన్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమాండెంట్ శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. బెటాలియన్‌లో ఫార్మాసిస్ట్ 2, బార్బర్ 2, చాకలి 3, ఆఫీస్ సబార్డినేట్ 2, పారిశుధ్య కార్మికులు 3, స్వీపర్ 5, హెల్త్ అసిస్టెంట్ 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆ ఉద్యోగాలకు ఔట్ సోర్సింగ్ పద్ధతిన ఉద్యోగులను తీసుకునేందుకు ఏప్రిల్ 4వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఇఫ్తార్ విందుకు హాజరైన ప్రభుత్వ విప్



ఇఫ్తార్ విందులో ఆది శ్రీనివాస్

రుద్రంగి మార్చి 31: రుద్రంగి మండల కేంద్రంలో మసీద్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఎర్రం గంగ నరసయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, చిలుకల తిరుపతి, గండి నారాయణ, మాడిశెట్టి అభిలాష్, మహేష్, తర్రె లింగం, గడ్డం స్వామి, సాదుల్లా, పిడుగు లచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి

తంగళ్లపల్లి, మార్చి 31: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని శుభోదయ ఇంగ్లీషు మీడియం పాఠశాల పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గంప సుధాకర్, హైస్కూల్ మాధవి, తిరుమల, గిరిజ, సుజాత, క్రాంతి, అనిల్, అజయ్, ఇంచార్జ్ పద్మశ్రీ, సరిత, వాణి, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ముస్తాబాద్, మార్చి 31 : ముస్తాబాద్ మండల కేంద్రంలో మడేలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను రజక సంఘం ఆధ్వర్యంలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సావాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆసరా పింఛన్లు జమ చేయకుంటే ఆందోళనలు

సిరిసిల్ల రూరల్, మార్చి 31 : రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పించన్లను సోమవారం సాయంత్రంలోగా ఖాతాల్లో జమ చేయకుంటే సీపీఐ ఆధ్వర్యంలో అందోళన కార్యక్రమాలు చేపడతామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ప్రకటించారు. సిరిసిల్ల పట్టణం సుభాష్‌నగర్‌లోని కార్మిక భవనంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఆసరా లబ్ధిదారులకు రెండు నెలల నుంచి పింఛన్లు రావడంలేదని, ప్రభుత్వం స్పందించి రెండు నెలల పింఛన్‌ను వారి ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా లబ్దిదారులకు నెలనెలా పింఛన్ ఇవ్వడం లేదన్నారు. ప్రతీ నెల 1వ తేదీన పింఛన్లు ఇవ్వాల్సి ఉంటుందని, ఇప్పటి వరకు వారి ఖాతాల్లో జమ చేయకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్ పెంచి అమలు చేయాలన్నారు. సోమవారం సాయంత్రంలోగా లబ్దిదారుల ఖాతాల్లో పింఛన్ డబ్బులను జమ చేయకుంటే మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ఆందోళనలు కొనసాగిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి పంతం రవి, కార్యవర్గ సభ్యులు కడారి రాములు, సోమనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థినుల ఎంపిక

రుద్రంగి, మార్చి 31: జవహర్ నవోదయ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశం కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షా ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ చెందిన విద్యార్థినులు ఓద్యారపు హరిణి, ఎర్రం తను శ్రీ ఎంపికయ్యారని పాఠశాల కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, ప్రిన్సిపాల్ హిరినాథ్ రాజు తెలిపారు.

ఆలయ మెట్ల నిర్మాణానికి భూమి పూజ

ఎల్లారెడ్డిపేట, మార్చి 31: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట శివారులోని దొంతురాల మల్లికార్జునస్వామి, మల్లన్న ఆలయ మెట్ల నిర్మాణానికి ఆలయ కమిటీ సభ్యులు, దాతలు ఆదివారం భూమి పూజ చేశారు. మెట్ల నిర్మాణం కోసం నిజామాబాద్ జిల్లా జక్రన్‌పల్లి మండలం పడ్కల్ గ్రామానికి చెందిన తోడుపునూరి అమృత, ఆమె కుమారులు వెంకటేశం, శ్రీనివాస్, సామ్రాట్‌లు రూ.30 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఒగ్గు పూజారులు బాలరాజుయాదవ్, మహేశ్‌యాదవ్, శ్రీ కృష్ణ యాదవ సంఘం సభ్యులు నాగరాజుయాదవ్, భూమయ్యయాదవ్, నాగమల్లేశ్‌యాదవ్, ఆదిమల్లయ్య యాదవ్, శేఖర్‌యాదవ్, లింగంయాదవ్, ఎల్లయ్యయాదవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్న నాయకులు

ఇల్లంతకుంట, మార్చి 31: మండలంలోని పలు గ్రామాల నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలిసింది. ఇటీవల పలు గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు సమావేశం అయ్యారు. జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్‌లో చేరికలు జోరు అందుకోగా మండలంలో ఇప్పటి వరకు జరగలేదు. దీనిపై దృష్టిసారించిన నాయకులు పలువురితో చర్చలు జరిపారు. పార్లమెంటు ఎన్నికలలోపు భారీ ఎత్తున పార్టీలో చేరికలు ఉంటాయని పేర్కొంటున్నారు.

కేసీఆర్ నగర్‌లో ఉచిత వైద్య శిబిరం

తంగళ్లపల్లి, మార్చి 31: తంగళ్లపల్లి మండలం మండెపల్లి కేసీఆర్ నగర్ కాలనీలో పద్మశాలీ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పోపా సభ్యుడు ఎంఈవో దుస రఘుపతి ప్రారంభించారు. సరయు హాస్పిటర్ సహకరంతో పోపా వైద్యులు తడుక సాయికుమార్, తాటిపాముల రవళి, గాదర్ల దీప్తి వైద్య సేవలు అందించారు. సుమారు 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు పోపా ప్రధాన కాన కార్యదర్శి ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు కనుకుంట్ల పున్నం చందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోపా ప్రతినిధులు వాసాల హరిప్రసాద్, బొల్లి భగవాన్, కొడం రాంప్రసాద్, అలువాల ఈశ్వర్, దాసరి తిరుమల, గాజుల ప్రతాప్, దుస శ్రీనివాస్, నాగుల శ్రీనివాస్, ద్యావనపల్లి పరమేశ్వర్, కారంపుడి రాజేశం, కనుకుంట్ల మధు, ఘడీల రమేష్, గడ్డం సత్యం, కాశీరాం, శివరాత్రి శంకర్, భైరి రవీందర్, శేఖర్, లక్ష్మణ్, సత్యనారయణ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో ప్రైవేట్ ధాన్యం



యార్డులో నిల్వ చేసిన ధాన్యం

రుద్రంగి, మార్చి 31: రుద్రంగి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో ఓ రైస్ మిల్లర్ ఏడాదిగా ధాన్యం నిలువ చేయడంతో స్థలం కొరతతో రైతులకు ఇబ్బందులు పడుతున్నారు. ఓ రైస్ మిల్లర్ ఏడాది క్రితం మార్కెట్ యార్డులో ధాన్యం నిల్వ చేశాడు. మార్కెట్ యార్డుకు ఇప్పటి వరకు అద్దె చెల్లించకుండానే ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని పలువురు ఆరోపణలు చేస్తున్నారు. ప్రస్తుతం యాసంగి సీజన్ వరి కోతలు ప్రారంభమయ్యాయి. ధాన్యాన్ని మార్కెట్ యార్డుకు తరలిస్తున్నారు. మార్కెట్ యార్డులో స్థలం కొరతతో ధాన్యం ఆరబెట్టేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించాలని, అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

నోటీసులు అందజేశాం

మార్కెట్ యార్డులో నిల్వ చేసిన ధాన్యం బస్తాలను తొలగించాలని ఇప్పటి వరకు మాడు సార్లు నోటీసులు జారీ చేశాం. ఇటీవల కూడా రైస్ మిలర్‌కు చెప్పాం. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన



చెరువు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సభ్యులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 31: కొందరు చెరువును పూడ్చుతున్నారని పేర్కొంటూ ఎల్లారెడ్డిపేట మండలం దుమాల శివారులోని పెద్ద చెరువు వద్ద ముదిరాజ్ సంఘం సభ్యులు ఆదివారం ఆందోళనకు దిగారు. చెరువులో చేపల పెంపకం ద్వారా సుమారు 140 కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని పేర్కొన్నారు. చెరువును పూడ్చడంతో తాము ఉపాధిని కోల్పోయి రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించాలని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం సభ్యులు బాబు, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

వీర్నపల్లి, మార్చి 31 :డిమాండ్లను నెరవేర్చాలని, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల మధ్యాహ్న భోజన పథకం కార్మికులు డిమాండ్ చేశారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట ఆదివారం నిరసన చేపట్టారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని, కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. విధి నిర్వహణలో ప్రమాదానికి గురైతే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్, చాకలి భాగ్య, శంకరయ్య, మల్లారం లక్ష్మి, రాజవ్వ, భూదవ్వ, గంగవ్వ, మమత, రాజవ్వ, పాల్గొన్నారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 31: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు అల్మాస్‌పూర్, నారాయణపూర్, బొప్పాపూర్, బండలింగంపల్లి తదితర గ్రామాల్లోని ఈస్టర్ వేడుకలను ఆదివారం క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఇల్లంతకుంట : మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిలలో ఆదివారం ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. ఏసుక్రీస్తు పునరుత్థాన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఎరవెల్లి మోజేస్, ఏసయ్యబాబు, సత్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుడి ఏకాంతోత్సవం

ధర్మపురి, మార్చి 31: ధర్మపురి వేంకటేశ్వర స్వామివారల ఏకాంతోత్సవం ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ వేద పండితులు స్వామి వారలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను సేవలపై ఉంచి ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేయించారు. సప్తావరణ పూజలు నిర్వహించారు. అర్ధరాత్రి స్వామివారల ఉత్సవ మూర్తులను ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్దకు తీసుకువెళ్లి పవళింపజేసి ఏకాంతోత్సవం నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి వారల పల్లకి సేవ ముందు చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, పట్టణ ఆర్యవైశ్య, వర్తక సంఘాల అధ్యక్షులు మురికి శ్రీనివాస్, అక్కెనపెల్లి రాజేందర్, కోశాధికారు లు రంగ శంకరయ్య, జక్కు దేవేందర్, ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పద్మ పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల పూజలు

ధర్మపురి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. స్థానిక లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ వేంకటేశ్వర దేవాలయాల్లో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించారు. స్వామివారలకు ఆస్థాన వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శేషప్ప కళా వేదికపై రాత్రి వేళలో హైదరాబాద్‌కు చెందిన కులకర్ణి గంగాధర్ బృందం కూడి పూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గోదావరిఖనికి చెందని డాక్టర్ జ్యోతిరంగ బృందం కూచి పూడి నృత్య ప్రదర్శ నలు రాత్రి వరకు భక్తులు తిలకించారు.

బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట, మార్చి 31: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలకు పాల్పడిందని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు, బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ కొండపురం బాల్‌రెడ్డి, మున్నూరు కాపు మండల అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు నంది కిషన్, మాజీ ఎంపీటీసీ బాలకిషన్ ఆధ్వర్యంలోని సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తలు, కుల సంఘం సభ్యులు ఆదివారం ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల బాగు కోరే ఏ నాయకుడైనా కాంగ్రెస్‌లోకి రావచ్చన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజాహిత కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలని ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందన్నారు. తాము పాలకులం కాదని, సేవకులం అని అన్నారు. కేటీఆర్ అధికారం కోల్పోయి మతి భ్రమించి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఫోన్ ట్యాంపింగ్ చేసి భార్యాభర్తల సంభాషణలు వినడం సిగ్గు చేటన్నారు. కేటీఆర్ అది తన గొప్పతనయని చెప్పుకోవడం మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. బతుకమ్మకు అంబాసిడర్‌గా చెప్పుకునే ఎమ్మెల్సీ కవిత లిక్కర్ కేసులో జైలుకు వెళ్లడం తెలంగాణ సమాజం తల దించుకోవాల్సి వస్తోందన్నారు. ఫోన్ ట్యాంపింగ్ వ్యవహారంలో కేటీఆర్‌తో ఆడపడచుల జీవితాలు నాశనం అయ్యాయని, జైలుకు వెళ్లక తప్పదని అన్నారు. బీఆర్ఎస్ బండారం ఒక్కోటి బయటకు వస్తున్నాయన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీ కనుమరుగవడం ఖాయమన్నారు. కాంగ్రెస్‌లో చేరిన ప్రతి ఒక్కరూ పార్లమెంటు ఎన్నికల్లో తమ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. పార్టీలో పాత, కొత్త అనే బేధాభిప్రాయం ఉండదని, ఎవరికి అవకాశం వస్తే అక్కడ సర్దుబాటు చేస్తామని అన్నారు. నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పని చేసి పార్టీ పటిష్టతకు పాటు పడాలన్నారు.నాయకులు లక్ష్మారెడ్డి, నర్సయ్య, గౌస్, తిరుపతి, లింగాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సాహెబ్, బుచ్చాగౌడ్, రాజేశం, బాబు, సుధాకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మహిళా విభాగం

కాంగ్రెస్ ఎల్లారెడ్డిపేట మండల మహిళా విభాగం కార్యవర్గాన్ని నియమించారు. మండల ప్రధాన కార్యదర్శిగా బుర్క జ్యోతి, ఉపాధ్యక్షురాలిగా గన్న శోభను ఆ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు ఆకుల లత ప్రకటించారు. పార్టీ బలోపేతానికి తాము కృషి చేస్తామన్నారు. తమ నియామకానికి సహకరించిన సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు లతకు కృతజ్ఞతలు తెలిపారు.

మండల కాంగ్రెస్‌లో ముసలం

బోయినపల్లి, మార్చి 31: నిన్న మొన్నటి వరకు ఏకతాటిపై ఉన్న మండల కాంగ్రెస్ నాయకులు పార్టీ అధికారంలో రాగానే వర్గ విభేదాలు తలెత్తాయి. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పార్టీ కార్యక్రమాల విషయంలో సమాచారం ఇవ్వడం లేదని, అంతేకాకుండా కొత్తగా పార్టీలో చేరిన వారికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని కాంగ్రెస్ మండల నాయకులు ఆరోపిస్తున్నారు. ఆదివారం బోయినపల్లి మండల కేంద్రంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీమ్‌రెడ్డి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డితోపాటు కొత్తగా చేసినవారు ఒంటెత్తు పోకడలకు వెళ్తున్నారని వాపోతున్నారు. స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా అధ్యక్షుడు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమైనట్లు సమాచారం. నెల రోజుల క్రితం మంజూరైన ఎస్డీఎఫ్ నిధులను సైతం కొత్తగా చేరిన వారికి అప్పగించేందుకు ప్రయత్నం చేయడం సరి కాదని వాపోతున్నారు. అభివృద్ధి పనులకు ప్రభుత్వ మంజూరు చేసే నిధుల వినియోగంలో ప్రతీ గ్రామ కార్యకర్తకు ప్రాధాన్యం లభించేలా ఐక్యంగా ఉండాలని చర్చించుకున్నట్లు సమాచారం.

ఐదుగురిపై కేసు

తంగళ్లపల్లి, మార్చి 31: విలేకరుల పేరిట డబ్బులు వసూలు చేసిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం రాత్రి వేములవాడ రైస్‌మిల్లు నుంచి సిద్దిపేటకు వడ్లను తీసుకెళ్తున్న లారీని పొన్నం చంద్రమౌళి, దూస రాజేందర్, చౌటపల్లి వెంకటేష్, అవునూరి ప్రశాంత్, నరేశ్ అడ్డుకున్నట్లు పేర్కొన్నారు. రైస్ మిల్లు యజమాని ఫోన్ చేశారని, అక్కడికి వచ్చిన యజమానికి తాము విలేకరులమని చెప్పారని తెలిపారు. ఉన్నాతాధికారులకు లారీ గురించి చెబుతామని బెదిరింపులకు పాల్పడి యజమాని నుంచి రూ.20 వేలు బలవంతంగా వసూలు చేశారని పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదుతో ఐదుగురిపై తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నేరానికి పాల్పడిన వ్యక్తుల్లో పొన్నం చంద్రమౌళిని రిమాండ్‌కు తరలించినట్లు, మిగతా నలుగురు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

కోనరావుపేట, మార్చి 31 : రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను పొందాలని కొలనూరు సింగల్ విండో చైర్మన్ రామ్మోహన్‌రావు అన్నారు. ఆదివారం కొలనూరు సింగిల్ విండో సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. రైతుల కోసం ఏర్పడ్డ సింగిల్ విండో కార్యాలయాలను రైతులే కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ కాశవేణి మహేష్, సింగిల్ విండో డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

వేములవాడ రూరల్, మార్చి 31 : మండలములోని ఎదురుగట్ల గ్రామానికి చెందిన పొన్నం పర్శరాం గౌడ్ ఇటీవల తాటి చెట్టు పైనుంచి పడి మృతి చెందగా బాధిత కుటుంబానికి రాష్ట్ర గౌడ యూనిఫామ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. 7వేల ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. రాష్ట్ర గౌడ యూనిఫామ్ అసోసియేషన్ సభ్యులు సీఐ రాజమౌళి గౌడ్, రిటైర్డ్ సీఐ బుచ్చిరాములు గౌడ్, నాగన్న గౌడ్, గోపా జిల్లా అధ్యక్షుడు కంచర్ల అమరేందర్ గౌడ్, వేములవాడ గోప పట్టణ అధ్యక్షుడు దూలం సంపత్ గౌడ్, కార్యదర్శులు విక్కుర్తి లక్ష్మీనారాయణ గౌడ్, కైరీ లింగయ్య గౌడ్, ఎదురుగట్ల గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

స్నేహితుల కుటుంబాలకు..

ముస్తాబాద్, మార్చి 31 : మండలంలోని మద్దికుంట గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన బాధిత కుటుంబానికి పదో తరగతి స్నేహితులు అండగా నిలిచారు. అనారోగ్యంతో మరణించిన నగేశ్ కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. మరో వ్యక్తి స్వామి చనిపోగా ఆర్థిక ఇబ్బం దులతో బాధపడుతున్న ఆ కుటుంబానికి మరో రూ. 5 వేలు అందించారు.

మహిళపై దాడి.. న్యాయం చేయాలని వేడుకోలు

చందుర్తి,మార్చి 31 : తన ఇంటికి నల్లా నీరు రావడంలేదని పైపు మరమ్మతు చేయాలని కోరగా పాత కక్షలతో మహిళపై కొబ్బరి మట్టతో కార్మికుడు దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చందుర్తి మండలం ఆశిరెడ్డి పల్లికి చెందిన బాధితురాలు కట్కూరి లక్ష్మి ఆదివారం విలేకరుల ఎదుట గోడు వెల్లబోసుకుంది. మార్చి 24న గ్రామపంచాయతీ సిబ్బంది నల్ల పైపులు మరమ్మతు చేస్తుండగా తన ఇంటికి పైప్ లైన్ ద్వారా నీరు రావడంలేదని తెలిపింది. పైప్ లైన్ మరమ్మతు కోసం తీసిన గుంతను పూడ్చి వేస్తుండడంతో తనకు నీళ్లు వచ్చేవరకు గుంతను పూడ్చవద్దని సిబ్బందిని కోరింది. సదరు మహిళకు వరసకు మరిది అయిన కార్మికుడు భూమయ్య పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని ఆవేశానికి లోనై దుర్భాషలాడుతూ అక్కడ ఉన్న తాటి మట్టతో కొట్టాడు. అదే రోజు పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపింది. పోలీసులు పట్టించుకోక పోవడంతో తిరిగి 27 పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. న్యాయం చేయాలని కోరగా కానిస్టేబుల్ తనపై ఆగ్రహం వ్యక్తం చేశాడని, వారం రోజులుగా తిరుగుతున్నా పట్టించుకోవడంలేదని వాపోయింది. తన భర్త కరోనాతో మృతి చెందాడని, తన మరిదితో తనకు ప్రాణ భయం ఉందని పేర్కొంది. న్యాయం చేయాలని కోరింది. ఈ విషయమై చందుర్తి ఎస్సై శ్రీకాంత్‌ను వివరణ కోరగా లక్ష్మిని ఏమి అనలేదని, బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్యాక్స్ డైరెక్టర్‌కు పరామర్శ

ఎల్లారెడ్డిపేట, మార్చి 31: ఎలారెడ్డిపేట మండలం తిమ్మాపూర్ ప్యాక్స్ డైరెక్టర్, గొల్లపల్లికి చెందిన పెంజర్ల నారాయణ తండ్రి నాంపల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని ప్యాక్స్ చైర్మన్ సుదీర్‌రావు, వైస్ చైర్మన్ కృష్ణామూర్తి ఆదివారం పరామర్శించారు. ఎంపీటీసీ బాబు, స్థానికుడు ఉపేందర్ తదితరులు ఉన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

రుద్రంగి, మార్చి 31 : రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన ఎమ్మె శివ కూమార్ (23) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై అశోక్, మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన ఎమ్మె శివకుమార్ రంగారెడ్డి జిల్లా మహేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో యువతిని ప్రేమించాడు. యువతికి సంబంధించిన వ్యక్తిగత ఫొటోలను సోషల్ మీడియాలో పెట్టాడని ఆమె బంధువులు గతంలో మహేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో శివకుమార్‌పై రెండు కేసులు నమోదయ్యాయి. కొద్ది రోజుల నుంచి ఫోన్ చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మనస్తాపానికి గురైన శివకుమార్ శనివారం రాత్రి పొలం వద్ద మామిడి చెట్టుకు చీరతో ఉరేసుకున్నాడు. శివకుమార్ తల్లి కొమురమ్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.